ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
గురువారం 19 సెప్టెంబరు 2024 | 5



ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాపై కసరత్తు

ఇప్పటివరకు 13,782 దరఖాస్తుల స్వీకరణ

వ్యక్తి దారుణ హత్య

మద్యం ప్రియులకు ఇక.. పండగే.. పండగ



- వైసీపీ నాసిరకం మద్యం స్థానంలో ఇకనుంచి పూర్తిగా క్వాలిటీ మద్యం
- గత ప్రభుత్వం అడ్డగోలుగా ధరలు పెంచి విక్రయించిన బ్రాండ్ల ధరలన్నీ తగ్గింపు
- రూ.99కే అన్ని రకాల బ్రాండ్ల మద్యం 180ఎంఎల్ బాటిళ్లలో అందుబాటులోకి..
- జిల్లాలో 170 మద్యం దుకాణాలకు త్వరలో దరఖాస్తుల స్వీకరణ
- రూ.2లక్షలు చెల్లించి ఎవరైనా డ్రాలో దుకాణం దక్కించుకునేందుకు ఛాన్స్
- నాసిరకం మద్యం విక్రయాలతో గత వైసీపీ సర్కారు జిల్లాలో వందలకోట్లు దండుడు
- ఏ బ్రాండ్ చూసినా నాసిరకమే: ఐదేళ్ల మందుబాబుల నరకానికి ఇకపై విముక్తి

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

మందుబాబులకు ఇక పండగే పండగ.. ఇకపై క్వాలిటీ మందు అందుబాటులో ఉండనుంది. అడ్డగోలు ధరలు బాధ లేదు.. నాసిరకం బ్రాండ్లు ఊసే ఉండదు.. ఏ బ్రాండ్ కావాలంటే ఆ బ్రాండ్.. ఖరీదైన బ్రాండ్లు తాగలేం అనే బాధే లేకుండా అందరికీ అన్ని రకాల బ్రాండ్ల మందు.. అదీ 180 ఎంఎల్‌లో.. ధర రూ.99కే. ఇదీ.. కూటమి ప్రభుత్వం బుధవారం నాటి కేబినేట్‌లో తీసుకున్న నిర్ణయం. వచ్చే నెల 1 నుంచి కొత్త మద్యం పాలసీ కింద సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. మందుబాబులకు గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన నాసిరకం బ్రాండ్లను తొలగించి నాణ్యమైన మందును అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. ఇకపై ప్రభుత్వమద్యం దుకాణాలస్థానంలో గతంలో అమలైన పాత విధానం తరహాలో అన్నీ ప్రైవేటు మద్యం షాపులే రానున్నాయి. రూ.2లక్షల ఫీజు చెల్లించి ఎవరైనా దుకాణం ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం పేర్కొంది. కొత్త పాలసీ కింద జిల్లాలో 170వైన్‌షాపులు ఏర్పాటు కానున్నాయి.

సగానికి సగం తగ్గినట్లే...

జిల్లాలో మందుబాబులకు అయిదేళ్ల నరకానికి త్వరలో విముక్తి లభించబోతోంది. మందు తాగాలని నోట్లో చుక్కేసుకుంటే దారుణమైన రుచి, వాసనతో ఇన్నాళ్లుగా మద్యం ప్రియులు పడ్డ బాధలకు వచ్చే నెల 1 నుంచి ఫుల్‌స్టాప్ పడబోతోంది. గత వైసీపీ ప్రభుత్వం బలవంతంగా అంటగట్టిన మందును ఇక తాగక్కర్లేకుండా పూర్తిగా నాణ్యతతో కూడిన మద్యం అందుబాటులోకి రాబోతోంది. ఈ మేరకు కూటమి ప్రభుత్వం బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. కేబినేట్ సమావేశంలో కొత్త మద్యం పాలసీకి ఆమోదం తెలిపి విధివిధానాలు ప్రకటించింది. ఇందులోభాగంగా వచ్చే నెల నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలు రద్దవనున్నాయి. వాటి స్థానంలో ప్రైవేటు షాపులు రాబోతున్నాయి. అంతేకాదు.. గత వైసీపీ ప్రభుత్వంవల్ల ఇప్పటికీ కొనసాగుతున్న నాసిరకం బ్రాండ్లు కూడా వచ్చే నెల నుంచి కనుమరుగవనున్నాయి. వాటిస్థానంలో నాణ్యమైన మందును రూ.99కే అందుబాటులోకి తేవాలని సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినేట్ సమావేశం నిర్ణయించింది. అందులోభాగంగా దాదాపు అన్ని రకాల బ్రాండ్ల మద్యాన్ని 180 ఎంఎల్ బాటిళ్లలో అందరికీ అందుబాటులోకి తీసుకురాబోతోంది.

గత ప్రభుత్వంలో నాసిరకం బ్రాండ్లు

గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు జిల్లాలో మందుబాబుల నుంచి వందల కోట్లు దోచుకుంది. నాసిరకం బ్రాండ్లను ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయించింది. అంతకుముందు అందరూ తాగే ప్రముఖ బాండ్లన్నింటినీ కనిపించకుండా చేసేసింది. కేవలం వైసీపీ నేతలకు చెందిన, ప్రభుత్వ పెద్దలకు ముడుపులు ఇచ్చిన నాసిరకం కంపెనీ బ్రాండ్లనే దుకాణాల్లో అమ్మింది. దీంతో మందుబాబులు అయిదేళ్లపాటు నరకం చూశారు. ఎప్పుడూ తాగే బ్రాండ్లు దొరక్క, ప్రభుత్వం విక్రయించిన నాణ్యత లేని మద్యాన్ని కొనుక్కుని తాగారు. అదికూడా పనికిమాలిన బ్రాండ్లకు ప్రముఖ బ్రాండ్లను మించి రెట్టింపు ధరలను మందుబాబుల నుంచి గత జగన్ ప్రభుత్వం పిండేసింది. చివరకు చీప్‌ను కూడా వదల్లేదు. దీని ధరను రూ.120కి విక్రయించి మందుబాబులను గుల్ల చేసేసింది. కానీ ఇప్పుడు వచ్చే నెల నుంచి అమల్లోకి రానున్న కొత్త పాలసీ కింద కూటమి ప్రభుత్వం చీప్ లిక్కర్‌ను రూ.99కే విక్రయించాలని నిర్ణయించింది. అది కూడా ప్రముఖ బ్రాండ్ల మద్యాన్ని అత్యంత నాణ్యతతో అమ్మబోతోంది. ప్రముఖ కంపెనీలకు చెందిన బ్రాందీ, విస్కీ, రమ్ము, బీరు, ఇతర వైన్ కేవలం డబ్బున్న మందుబాబులకే పరిమితం. వీటిని పేదవర్గాలకు చెందిన మందుబాబులు తాగాలన్నా ధరలు షాక్ కొట్టే పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రముఖ బ్రాండ్ల మద్యాన్ని సైతం పేదలకు అందుబాటులోకి తేవడానికి చిన్న సీసాల్లో రూ.99కే విక్రయించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. తద్వారా మందుబాబులు గత వైసీపీ ప్రభుత్వంలో అనారోగ్యాలు చెడగొట్టుకుని మరణించే పరిస్థితులు తలెత్తకుండా కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అమ్ముడవుతున్న బ్రాండ్ల స్థానంలో ఇకపై గతంలో దొరికిన అన్ని ప్రముఖ బ్రాండ్లు దాదాపు సగానికి సగం తగ్గించి కూటమి ప్రభుత్వం విక్రయించబోతోంది. ఒకరకంగా మందుబాబులకు ఇక పండగే పండగ అన్నమాట.



170 దుకాణాలకు దరఖాస్తులు

జిల్లాలో ప్రస్తుతం 154 ప్రభుత్వ మద్యం దుకాణాలు నడుస్తున్నాయి. ఇవన్నీ వచ్చేనెల 1 నుంచి పూర్తిగా రద్దవుతాయి. వీటిస్థానంలో ప్రైవేటు వ్యక్తులు వైన్‌షాపులు నడుపుతారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు దుకాణాల ఏర్పాటు కోసం జిల్లా ఎక్సైజ్‌శాఖ కసరత్తు ప్రారంభించింది. గతంలో జిల్లాలో 170 దుకాణాలు ఉండగా, కొన్నింటిని రద్దు చేసి 154కి పరి మితం చేశారు. కానీ ఇప్పుడు కొత్త పాలసీ కింద జిల్లాలో 170 దుకాణాలు ఏర్పాటు చేయబోతు న్నారు. వీటి ఏర్పాటుకు త్వరలో దరఖాస్తులు ఆహ్వానించనున్నారు. రూ.2లక్షల నాన్‌రిఫండబుల్ ఫీజు చెల్లించి ఒక్కో వ్యక్తి గరిష్ఠంగా ఐదు దుకాణాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇలా దరఖాస్తు చేసుకున్న వారికి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటయ్యే కమిటీ సమక్షంలో డ్రా తీసి రెండేళ్ల కాల వ్యవధి కింద దుకాణాలు కేటాయిస్తారు. అంటే ప్రైవేటు మద్యం దుకాణం ఎవరికైనా లాటరీ విధా నం కింద అదృష్టం వరించి దక్కొచ్చు. వైన్‌షాపు దక్కించుకున్న వ్యక్తి ఉదయం పది నుంచి రాత్రి పది వరకు కేటాయించిన ప్రదేశంలో మద్యం దుకాణాం నిర్వహించాల్సి ఉంటుంది. మరోపక్క గీతకార్మికులకు పదిశాతం షాపులు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఉన్న మొత్తం షాపుల్లో 17 కల్లుగీత కార్మి కులకు అందనున్నాయి.



దీపావళికి తొలి ఉచిత గ్యాస్ సిలిండర్

- కేబినెట్ సమావేశంలో సీఎం నిర్ణయం
- జిల్లాలో 6లక్షలమంది గ్యాస్ వినియోగదారులు
- మహిళల హర్షం.. నిబంధనల ప్రకారం అమలు

కలెక్టరేట్(కాకినాడ),సెప్టెంబరు 18: సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా కూటమి ప్రభుత్వం అర్హులైన వారికి తొలి ఉచిత గ్యాస్ సిలిండర్‌ను దీపావళి పండుగకు అందజేయనుంది. ఈ మేరకు సీఎం చంద్రబాబు ఏపీ కేబినెట్ సమావేశంలో బుధవారం ఈ నిర్ణయం ప్రకటించారు. దీనిపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 6లక్షల గ్యాస్ సిలిండర్ల వినియోగదారులు ఉన్నారు. వీరికి ప్రభుత్వం విడుదల చేసే నిబంధనలను అనుసరించి వీరిలో మెజార్టీ వినియోగదారులకు లబ్ధి జరగనుంది. సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో తొలి గ్యాస్ సిలిండర్‌ను అందజేయనుంది. దీనిపై జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రసాద్‌ను సంప్రదించగా సీఎం ఆదేశాల ప్రకారం గ్యాస్ సిలిండర్లను అందజేస్తామన్నారు. కాగా, ఒక గ్యాస్‌సిలిండర్ కొనుగోలుకు రూ.870 వ్యయమవుతోంది. దీనిప్రకారం ఏడాదికి ఇచ్చే మూడు సిలిండర్ల ధర రూ.2610 అవుతుందని, ఈ మొత్తం ఆదా అవుతుందని గ్యాస్ వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వరద నష్టాలపై కలెక్టర్, జేసీలతో రెవెన్యూ ప్రత్యేక కార్యదర్శి సమీక్ష

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబర్ 18: గత జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన భారీవర్షాలు,వరదల నష్ట గణనపై రాష్ట్ర విపత్తుల నిర్వహణ అథారిటీ, రాష్ట్ర రెవెన్యూ ప్రత్యేక కార్యదర్శి ఆర్పీ సిసోడియా అమరావతి నుంచి బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి కాకినాడ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్‌మీనా ఇతర అధికారులతో కలిసి హాజరయ్యారు. భారీవర్షాలవల్ల జరిగిన నష్టాలను స్పెషల్ సీఎస్ అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గత మూడు నెలల్లో కురిసిన భారీవర్షాలు, ఏలేరు వరద కారణంగా నష్టపోయిన రైతులకు, దెబ్బతిన్న గృహాలు, ఇతర వాటికి పరిహారం చెల్లిస్తామన్నారు. ప్రా థమిక అంచనా ప్రకారం జిల్లాలో 16 మండలాలకు సం బంధించి 40 గ్రామాలు, 4 మున్సిపాలిటీ ప్రాంతాలు ప్రభావితం అయ్యాయన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్ పాల్గొన్నారు.

తగ్గుముఖం పడుతున్న వరద

పిఠాపురం/గొల్లప్రోలు, సెప్టెంబరు 18: మిగులు జలాల విడుదలను తగ్గించడంతో ఇప్పటివరకూ ముంపులో ఉన్న పంటపొలాలు బయటపడుతున్నాయి. కాలువ వెంబడి ప్రాంతాల్లో మినహా మిగిలిన ప్రాంతాల్లో నీరు పూర్తిగా తగ్గింది. ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో రెండు, మూడు రోజుల్లో పొలాలు ఆరతాయని రైతులు చెబుతున్నారు. ఏలేరు రిజర్వాయర్ నుంచి మిగులు జలాల విడుదలను బుధవారం మరింత తగ్గించారు. ప్రస్తుతం ప్రాజెక్టునుంచి 3,875 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లోస్ 2,687 క్యూసెక్కులు క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వస్తున్నాయి. కాలువలకు 3వేల క్యూసెక్కుల నీటిని, డీసీఆర్ స్లూయిస్ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా విశాఖ తాగునీటి అవసరాలకు 275క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. నీటి విడుదల తగ్గిన నేపథ్యంలో పంట పొలాల్లో ముంపు గురువారానికి పూర్తిగా తగ్గనుంది. బుధవారం సాయంత్రం నాటికి కాలువల చెంతన ఉన్న పొలాల్లో మినహా మిగిలిన ప్రాంతాల్లో వరద నీరు తగ్గింది. పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో 400 ఎకరాల్లో మాత్రమే ముంపు ఉన్నట్లు చెబుతున్నారు. ఇది ఒక రోజులో తగ్గిపోతుందని, ఎండ ఎక్కువగా ఉండడంతో పొలాలు త్వరగా ఆరతాయని రైతులు తెలిపారు.

30మంది సభ్యులతో నూతన సహకార సంఘాల ఏర్పాటు

- జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ పెద్దిరాజు

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 18: రాష్ట్ర చేనేత జౌళిశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో 30మంది సభ్యులతో నూతన సహకార సంఘాలు ఏర్పాటు చేసుకోవచ్చని జిల్లా చేనేత, జౌళి శాఖ ఏడీ కె.పెద్దిరాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం అమలు పరుస్తున్న వివిధ పథకాలనుంచి లబ్ధి పొందడానికి నూతన ప్రాథమిక చేనేత సహకార సంఘాల ఏర్పాటుకు అనుమతిచ్చినందున సొంత మగ్గం కలిగి ఉండి చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నవారు జిల్లా చేనేత జౌళి శాఖ అధికారిని సంప్రదించాలని కోరారు. సొంత మగ్గం కలిగి ఉండి చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తుంటే సంఘ సభ్యత్వం కోసం ప్రాథమిక చేనేత సహకార సంఘాలను సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు.

పోలవరం పనుల్లో.. కదలిక

- జీవో విడుదలతో కాల్వ స్థితిగతులు పరిశీలించిన అధికారులు
- పనులు పూర్తయితే తీరనున్న తాగు, సాగునీటి కష్టాలు



తునిలో తాండవ నది వద్ద నిలిచిపోయిన అక్విడెక్ట్ నిర్మాణ పనులు



కుమ్మరిలోవ వద్ద పనులను పరిశీలిస్తున్న జలవనరులశాఖ అధికారులు

తుని రూరల్, సెప్టెంబరు 18: పోలవరం పనుల్లో కదలిక వచ్చింది. ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం బహుళార్థక ప్రాజెక్టుకు ఎట్టకేలకు మంచి రోజులు వచ్చాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో పోలవరం పనుల్లో పురోగతి కనిపించనుంది. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటికే కాలువ పునరుద్ధరణకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. టెండర్లకు సంబంధించిన జీవో విడుదలతో తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు తాగు, సాగునీటితోపాటు పారిశ్రామిక అవసరాలు తీరే అవకాశం ఉంది. పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ పూర్తయితే నాలుగు జిల్లాల్లో 4లక్షల పైబడి ఎకరాలకు సాగునీరు అందనుంది. విశాఖలో తాగు, సాగునీరు అవసరాలు తీరడంతోపా టు పారిశ్రామిక అవసరాలకు నీరు అందుబాటులోకి రానుంది.

● వైసీపీ పాలనలో ముందుకు పడని అడుగు

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పోలవరం అడుగు ముందుకు పడని పరిస్థితి ఏర్పడింది. పోలవరం ఎడమ కాలువ రూ.4200కోట్లు అంచనాతో పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే రూ.2963 కోట్లు విలువైన పనులు పూర్తయ్యాయి. వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ విధానాలతో ప్రారంభం కాని పనులతోపాటు నిర్మాణంలో ఉన్న పనులు ఆపేసింది. కూటమి ప్రభుత్వం పోలవరం పనులపై దృష్టిసారించింది. ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించి గొల్లప్రోలు, తుని, తొండంగి తదితర మండలాల్లో అడ్డంకులు తొలగించాల్సిందిగా జలవనరులశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆ శాఖ ఉన్నతాధికారులు తునిలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. పనుల స్థితిగతులను పరిశీలించారు. ఫొటోగ్రాఫికల్ సర్వే పూర్తి చేసి హైవే క్రాసింగ్ కాంక్రీట్ పనులు, కాలువ మట్టి పనులు కొలిక్కి తెచ్చేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

ఆకాశాన్నంటుతున్న.. కూరగాయల ధరలు



- వరదల ప్రభావంతో మరింత ఘాటు
- రోజురోజుకు పెరుగుతున్న ఉల్లి ధరలు

జిల్లాలో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. సామాన్యులకు దడ పుట్టిస్తున్నాయి. మధ్యతరగతి ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. ఏటా వానాకాలంలో సహజంగా కూరగాయల ధరలు పెరుగుతుంటాయి. దీనికితోడు వరదలు ప్రభావంతో మునుపెన్నడూ లేని విధంగా ధరలు ఆకాశాన్నంటాయి. ఇదివరకు రూ.300 ఖర్చు చేస్తే వారం రోజులకు సరిపడా కూరగాయలు వచ్చేవి. కానీ ప్రస్తుతం రూ.500 ఖర్చు చేసినా మూడురోజులకు సరిపడా కూరగాయలు వచ్చే పరిస్థితి లేదు.

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబర్ 18: జిల్లావ్యాప్తంగా కూరగాయల ధరల పెరుగుదలతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. వంకాయ, ఆకాకర, బీన్స్, అల్లం సెంచరీ కొట్టాయి. కొత్తిమీర, పుదీనా అయితే డబుల్ సెంచరీ కూడా కొట్టేశాయి. ఉల్లిపాయలు, క్యాప్సికం సెంచరీ దిశగా పయనిస్తుండగా అదే దారిలో ఉన్నాయి. మధ్య తరగతి ప్రజలకు కూరగాయలు చుక్కలు చూపిస్తున్నాయి. పెరిగిన ధరలతో ఏం కొనాలి, ఏం తినాలని జనం బెంబేలెత్తుతున్నారు.

ధరలు ఇలా..

ఉల్లిపాయలు నిన్న మొన్నటివరకు కిలో రూ.40 నుంచి రూ.60 ఉండేది. ఇప్పుడు రూ.80 నుంచి రూ.90 ఉంది. వంకాయ కిలో రూ.40 నుంచి రూ.50 ఉండేది ఇప్పుడు కేజీ రూ.120, బీన్స్ కేజీ రూ.60 నుంచి రూ.70 ఉంటే ఇప్పుడు రూ.130 నుంచి 150 వరకు పలుకుతుంది. ఇక అల్లం గురించి చెప్పక్కర్లేదు. ప్రతి వంటకంలో విరివిగా వాడే అల్లం సామాన్యప్రజలకు అందుబాటులో లేకుండా పోతోంది. దీని ధర రూ.150 నుంచి రూ.180 ఉంది. ఆకాకర కాయలు రూ.150 నుంచి రూ.180. ఇక కొత్తిమీర, పుదీనా గురించి చెప్పాలంటే వాటి ధరలు మాటలకు కూడా అందడంలేదు. కొత్తిమీర కిలో రూ.200, పుదీనా కిలో రూ.200. క్యాప్సికం రూ.90 నుంచి రూ.100 వరకు పెరిగింది.

మార్కెట్‌కు కూరగాయల కొనుగోలుకు వెళ్లే వారికి ధరలను చూసి కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. కూరగాయల సాగు బాగా తగ్గడంతోపాటు సాగు చేసిన కూరగాయల పంటలు వరదలకు బాగా దెబ్బ తిన్నాయని, ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవడం వల్ల రవాణా చార్జీలు కలిపి ధరలు ఆకాశాన్నంటుతున్నాయని వ్యాపారులు చెప్తున్నారు. ముున్ముందు వర్షాలు ఎక్కువగా కురిస్తే కూరగాయలు కొనే పరిస్థితి ఉండదేమోనని, కోడిగుడ్డు, చికెన్ ధరలతో పోటీపడుతుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి ధరలు నియంత్రించాలని కోరుతున్నారు.

ఆకుకూరల ధరలూ.. అమాంతం పైపైకి..



సామర్లకోట, సెప్టెంబరు 18: ఆకుకూరల తోటలు ఎండిపోవడం, కుళ్లిపోవడం కారణంగా మార్కెట్లో వాటి ధరలు ఆకాశన్నంటుతున్నాయి. మార్కెట్లలో ఆకుకూరల ధరలు మండుతున్నాయి. సామర్లకోట, పెద్దాపురం మార్కెట్లలోనూ సంత మార్కెట్ ప్రాంతాల్లోను తోటకూర, గోంగూర, బచ్చలి, కొత్తిమీర, కరివేపాకు, చుక్కకూర, పాలకూర పొన్నగంటికూర, మెంతుకూర, పుదీనా వంటి ఆకుకూరల ధరలు పైపైకి చేరాయి. ఆకుకూరల ధరలు ఇలా పెరగడంవల్ల సామాన్యులే కాదు ధనికులు సైతం ఆకుకూరలు కొనాలంటే బెంబేలెత్తుతున్నారు. అత్యంత చౌకగా అధిక విటమిన్లు లభించే ఆకుకూరలు అధికంగా భుజించాలని వైద్యులు మాత్రమే కాకుండా పౌష్టికాహార మాసోత్సవాలు పురస్కరించుకుని పలువురు న్యూట్రిషియన్లు సూచిస్తున్నారు. దీంతో సహజంగానే వీటికి డిమాండ్ పెరిగింది. కాలానుగుణంగా వాతావరణ పరిస్థితులు లేకపోవడంతో వీటిని సాగుచేస్తున్న రైతులు తల్లడిల్లుతున్నారు. దిగుబడులు అంతంతమాత్రంగానే ఉండడంతో వీటి ధరలు అమాంతంగా పెరిగాయి.

- తోటకూర 4కట్టలు రూ.10కి లభించేది. నేడు రూ.10కి ఒకకట్ట మాత్రమే లభిస్తున్నాయి.
- కొత్తిమీర పెద్ద కట్ట రూ.30కి లభించేది. నేడు అదేకట్ట రూ.50కి పెరిగింది.
- గోంగూర రెండు కట్టలు రూ.30కి లభించేది. నేడు కట్ట రూ.20కి పెరిగింది.
- బచ్చలి 4కట్టలు రూ.10కి లభించేది. నేడు రెండుకట్టలు రూ.10కి చేరింది.
- కరివేపాకు 4 కొమ్మలు రూ.20కి లభించేది. నేడు రూ.40కి పెరిగింది.
- చుక్కకూర, పాలకూరల ధరలు కూడా అమాంతంగా పెరిగాయి. 5 కట్టలు రూ.50కి పెరిగాయి.

ధరల పెరుగుదలతో ప్రజలు ఆకుకూరలు రుచి చూడాలంటేనే బెంబేలెత్తే పరిస్థితులు నెలకొన్నాయి. ఆకుకూరల వ్యాపారంలో గతంలో ఎన్నడూ లేని రీతిలో ధరలు పెరిగాయని వ్యాపారులు అంటున్నారు. సామర్లకోట ఆకుకూరల హోల్‌సేల్ వ్యాపారి శ్రీను మాట్లాడుతూ అధిక వర్షాలవల్ల ఎదుగుదల లోపించిందన్నారు. బెంగుళూరు నుంచి కొత్తిమీర, గుంటూరు, విజయవాడ నుంచి కరివేపాకు దిగుమతులు చేసుకోవడంతో వీటి ధరలు అమాంతంగా పెరిగాయంటున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

- ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే, ఎంపీల సమావేశంలో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 18: వందరోజుల కాలంలో ఎమ్మెల్యేల పనితీరు బాగానే ఉందని, రాబోయేరోజుల్లో ప్రజలకు మరింతగా అందుబాటులో ఉండాలని సీఎం నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజుల పూర్తయిన సందర్భంగా బుధవారం మంగళగిరిలోని సీకే కన్వన్షన్ హాల్‌లో ఎన్డీఏ కూటమికి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు భవిష్యత్ కార్యాచరణపై శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పార్లమెంటు సభ్యులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో కాకినాడ జిల్లాకు చెందిన కూటమి ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వనమాడి కొండబాబు, పంతం నానాజీ, వరుపుల సత్యప్రభ, యనమల దివ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జిల్లా ఎమ్మెల్యేలు సత్యప్రభ, దివ్య, నానాజీ, కొండబాబు, నెహ్రూ



కూటమి సర్కారు కొరడా

- పోలవరం భూసేకరణ పరిహారంలో రూ.19.52 కోట్ల అక్రమ చెల్లింపులు గుర్తింపు
- బాధ్యులైన ఉన్నతాధికారులతో పాటు అక్రమ లబ్ధి పొందిన గిరిజనేతర రైతులపై చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- సొమ్ము మొత్తం వసూలు చేయాలని రంపచోడవరం సబ్ కలెక్టరుకు ఆదేశం

పోలవరం జాతీయ ప్రాజెక్టు కింద చేపట్టిన భూసేకరణ పరిహారంలో రూ.19.52 కోట్ల మేర అక్రమ చెల్లింపులు జరిగాయని గుర్తించిన కూటమి ప్రభుత్వం బాధ్యులైన ఉన్నతాధికారులతో పాటు అక్రమ లబ్ధి పొందిన గిరిజనేతర రైతులపై చర్యలకు కొరడా ఝుళిపించింది. ఈ బాగోతాలకు సంబంధించి బుధవారం జీవో నెం.629, 631గా రెవెన్యూ (విజిలెన్స్) విభాగం ద్వారా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోలవరం భూ సేకరణ, పునరావాస అక్రమాలపై గడచిన ఐదేళ్లలో 'ఆంధ్రజ్యోతి' అనేక కథనాలు ప్రచురించిన సంగతి తెలిసిందే.

రంపచోడవరం, సెప్టెంబరు 18:

అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం కొండమొదలు పంచాయతీలో భూములకు సంబంధించి 2019 జూలై నుంచి 2022 ఫిబ్రవరి వరకు 27 మంది అనర్హులైన గిరిజనేతర రైతులకు అప్పటి స్పెషల్ కలెక్టరు ఇ.మురళి, రాజమహేంద్రవరంలోని ఎడమ కాలువ యూనిట్-1 స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (ఇన్‌చార్జిగా ఉన్న) చింతూరు యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి రూ.19.52 కోట్ల మేర దఫదఫాలుగా చెల్లింపులు సాగించేశారు. ఈ అక్రమ బాగోతంపై కొన్నేళ్లుగా ఫిర్యాదులు అందిన, పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ నుంచి నివేదికలు అంది, సంబంధిత అధికారుల నుంచి బాధ్యులపై తగు చర్యలకు సూచనలు ఉన్నా జగన్ ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.

కాగా గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై కూటమి సర్కారు దృష్టి సారించిన నేపథ్యంలో ఈ బాగోతాల ఫైలు కూడా బయటపడింది. దీంతో సదరు అంశాలను నిశితంగా పరిశీలించిన ప్రభుత్వం బాధ్యులపై తక్షణ చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగానే సదరు ఉత్తర్వులు జారీ చేసింది. దాని ప్రకారం కేవలం ఒక్క కొండమొదలులో మాత్రమే చోటుచేసుకున్న భూసేకరణ అక్రమాలను చూస్తేనే ప్రభుత్వ ఖజానాకు భూ సేకరణ అధికారులు అనర్హులైన రైతులతో కుమ్మక్కయి చేకూర్చిన నష్టాన్ని భర్తీ చేసే చర్యలను కూడా ప్రభుత్వం చేపట్టింది. రెవెన్యూ రికవరీ చట్టం కింద సదరు రూ.19.52 కోట్ల అక్రమ చెల్లింపులను ఆయా అధికారుల నుంచి, పరిహారం పొందిన గిరిజనేతర రైతుల నుంచి ముక్కుపిండి మరీ వసూలు చేయాలని రంపచోడవరం సబ్ కలెక్టరును ప్రభుత్వం ఆదేశించింది.

ఇదిలా ఉండగా బాధ్యులైన అధికారులుపైన, గిరిజనేత రైతులపైన అవినీతి నిరోధక చట్టం కింద క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు చేపట్టాలని కూడా ఆదేశించింది. అయితే ఈ బాగోతంపై ఇప్పటికే అప్పటి అల్లూరి కలెక్టర్ సుమిత్‌గాంధీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవీపట్నం పోలీసు స్టేషన్లో క్రైం నెం.70/2022గా కేసు నమోదు కాగా అందులోసదరు అధికారులు, గిరిజనేతర రైతులు ముందస్తు బెయిలు పొందారు. ఇది ఇంకా దర్యాప్తు స్థాయిలోనే మిగిలి పోయింది. అయితే ఇప్పుడు అవినీతి నిరోధక చట్టం కింద చర్యలు చేపట్టాలని ప్రభుత్వం అల్లూరి జిల్లా కలెక్టరును ఆదేశించడంతో ఇప్పటికే నమోదై ఉన్న కేసును ఏసీబీకి బదిలీ చేయడం అనివార్యమవుతోంది. ఈ వ్యవహారమే కాకుండా ఇంకా అనేక అక్రమ వ్యవహారాలు వందల కోట్ల రూపాయల మేర చోటుచేసుకున్న విషయం కూడా ప్రభుత్వ పెద్దల వద్ద పెండింగులో ఉంది. ముఖ్యంగా పోలవరం జాతీయ ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వానిది కావడంతో ఇక్కడ జరిగే అక్రమాలు కేంద్ర దర్యాప్తు సంస్థ అయిన సీబీఐ ద్వారా జరిపించాల్సి వస్తుందన్న వాదనలు కూడా అధికార వర్గాల్లో వినిపిస్తున్నాయి.



విజిలెన్స్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

రంప మన్యంలో రూ.వెయ్యి కోట్ల పనులపై

విచారణ జరపండి

విజిలెన్స్ డైరెక్టర్ జనరల్‌కు రంపచోడవరం ఎమ్మెల్యే వినతి

రంపచోడవరం, సెప్టెంబరు 18: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన పనులపై విజిలెన్స్ విచారణ కోరుతూ రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి బుధవారం విజిలెన్స్ డైరెక్టర్ జనరల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మొత్తంగా సుమారు వెయ్యి కోట్ల రూపాయల మేర జరిగిన పనుల్లో నాణ్యతా లోపాలు, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టడం, లబ్ధిదారుల ప్రయోజనాలను దెబ్బతీయడం వంటి అనేక లోపభూయిష్ఠ అంశాలను ఎత్తిచూపి ఎమ్మెల్యే ఇక్కడి పరిస్థితులను డైరెక్టర్ జనరల్‌కు వివరించారు. ముఖ్యంగా రూ.139.75 కోట్లతో సీసీ రోడ్లు, రూ.135 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు, రూ.36.64 కోట్లతో నాడు-నేడు పనులు.... వీటికి అదనంగా పోలవరం ప్రాజెక్టు కింద దేవీపట్నం మండలంలోని 44 ఆవాసాల నిర్వాసితులకు పునరావాసం కల్పించని వ్యవహారాలు, పునరావాస కాలనీల నిర్మాణం, రోడ్ల పనులు, భూముల కొనుగోలు తదితర అంశాలను ఎమ్మెల్యే వివరించారు.

నేడు, రేపు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పర్యటన

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 18: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి ఈ నెల 19, 20 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పర్యటిస్తారని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారిణి కె.విజయకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌సీడబ్ల్యు ఆదేశానుసారం రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో రాజమహేంద్రవరంలో జరిగే రాష్ట్రీయ పోషణ్ కార్యక్రమంలో చైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. పర్యటనలో భాగంగా ఆమె సెంట్రల్ జైలులోని ప్రత్యేక మహిళా జైలును సందర్శిస్తారు. ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మహిళల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. బాధిత మహిళల ఫిర్యాదులు స్వీకరించడానికి గురువారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు, శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు అందుబాటులో ఉంటారు.



లైంగిక వేధింపులపై

- ఘటన తెలిసి కూడా ఫిర్యాదు చేయని సంక్షేమాధికారి, పాఠశాల నిర్వాహకులు
- బాధిత విద్యార్థి నుంచి అందిన ఫిర్యాదునే కేసుగా నమోదు చేసిన పోలీసులు
- తొలుత పాలనా కారణాలతో హెచ్‌ఎంకు డిప్యూటేషన్‌తో సరిపెట్టిన వైనం

గిరిజన సంక్షేమ శాఖ నిర్లక్ష్యం

రంపచోడవరం, సెప్టెంబరు 18: రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని ఓ ఆశ్రమ పాఠశాలలో లైంగిక వేధింపులపై మీడియాలో కథనాలు వచ్చే వరకు గిరిజన సంక్షేమ శాఖ నిర్లక్ష్యం ప్రదర్శించింది. బాలల లైంగిక వేధింపుల ఘటన ఎప్పటికీ వెలుగులోకి రాదనుకున్నారో ఏమో గానీ... తీవ్రంగా తీసుకోని పాఠశాల నిర్వాహకులు, అడ్డతీగల సహాయ గిరిజన సంక్షేమాధికారి వైఖరి ఏకంగా గిరిజన సంక్షేమ విద్యా వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసింది. ఈ నెల 6వ తేదీ వరకు జరిగిన లైంగిక దాడుల పరంపరపై బాధిత విద్యార్థినులు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు తెలియజేశారు. తహసీల్దారుకు, ఆశ్రమ పాఠశాల నిర్వాహకులకు, ఏటీడబ్ల్యువో దృష్టికి చేరినా తీవ్రంగా పరిగణించకుండా కేవలం నోటి మాటతో ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి సదరు లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న హెచ్‌ఎంను అక్కడి నుంచి మార్చితే చాలని సూచించారు. దీంతో ఘటన తీవ్రత తెలియని అధికారులు సదరు కామాంధ ప్రధానోపాధ్యాయుడిని ఈ నెల 12న పాలనా కారణాలతో మాత్రమే డిప్యుటేషన్‌పై మంగంపాడు పంపించారు. అయితే అధికారులు ఊహించని రీతిలో లైంగిక వేధింపులపై మీడియాలో కథనాలు వచ్చాయి. ఓ మేజిస్ట్రేట్ దృష్టికి కూడా ఈ అంశం వెళ్లడం, గిరిజన సంఘాలు ఉద్యమాలకు సిద్ధమవుతున్నాయని గ్రహించడం వంటి కారణాలతో ఉన్నతాధికారులు స్పందించక తప్పలేదు. ఈ నేపథ్యంలో అల్లూరి జిల్లా కలెక్టరు ఆదేశాలతో సదరు ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణను సస్పెండ్ చేశారు. ఇంత జరిగాకా కూడా బాధిత విద్యార్థినులకు అండగా నిలిచి పోలీసులకు ఫిర్యాదు చేయడానికి సదరు విద్యాలయంలో కానీ, గిరిజన సంక్షేమ శాఖలో కానీ ఎవరూ ముందుకు రాకపోవడం శోచనీయం. మీడియా కథనాలపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించి పోలీసులను పంపారు. విద్యాలయంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు కానీ, వార్డెన్ కానీ, గిరిజన సంక్షేమాధికారి కానీ ఎటువంటి ఘటనా జరగనట్టే వ్యవహరించి పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో బాధిత విద్యార్థిని నుంచే ఫిర్యాదు తీసుకుని పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. లోతుగా దర్యాప్తు చేస్తే ఘటనను దాచిపెట్టినందుకు, సకాలంలో ఫిర్యాదు చేయనందుకు విద్యాలయ నిర్వాహకులు, సంక్షేమాధికారులు కూడా పోక్సో చట్టం కింద నిందితులవుతారని ఆదివాసీ సంఘాల నాయకులు చెప్తున్నారు.

విచారణాధికారిగా సబ్ కలెక్టర్ కల్పశ్రీ

గంగవరం ఆశ్రమ పాఠశాలలో లైంగిక వేధింపుల ఘటనపై అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశాలతో విచారణాధికారిగా రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీని నియమించినట్టు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం బుధవారం మీడియాకు తెలిపారు. ఇప్పటికే ఈ ఘటనపై జరిగిన ప్రాథమిక విచారణ అనంతరం బాధ్యుడైన ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణను సస్పెండ్ చేశామన్నారు. గిరిజన విద్యాలయాల్లో విద్యార్థినీ, విద్యార్థులకు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, ఇతరలెవరి నుంచి ఎటువంటి ఇబ్బంది కలిగినా ఉపేక్షించేది లేదని ప్రాజెక్టు అధికారి హెచ్చరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాపై కసరత్తు

ఇప్పటివరకు 13,782 దరఖాస్తుల స్వీకరణ

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 18: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా రూప కల్పనకు కసరత్తు జరుగుతోంది. దీనికి సంబంధించి ఈ నెల 3వ తేదీ వరకు 13,782 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం బుధవారం వాటిని కాకినాడ కలెక్టరేట్‌కు తీసుకొచ్చారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న డీఆర్వో తిప్పేనాయక్ వాటిని పరిశీలిస్తున్నారు. ఈ నెల 24వ తేదీన ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేయనున్నారు. నవంబరు 6న తుది జాబితా విడుదల చేస్తారు.



జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత నరసింహారావు

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు 'శ్రీప్రకాష్' విద్యార్థుల ఎంపిక

తుని రూరల్, సెప్టెంబరు 18: సీబీఎస్ఈ కబడ్డీ పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు సీబీఎస్ఈ బోర్డు గద్వాల్‌లో నిర్వహించిన క్లస్టర్-7 (ఆంధ్రా, తెలంగాణ) పోటీల్లో బాలుర విభాగం అండర్-14లో శివాజీ బృందం, అండర్-19లో (ఎం.గణేష్, శివ, సాయిరాం బృందం) ప్రథమ స్థానాల్లో నిలిచి బంగారు పతకాలు సాధించారు. ఉత్తర ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. విజేతలను శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సీహెచ్‌కేవీ నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, కోచ్ లక్ష్మణ్, చిన్నరాజు తదితరులు అభినందించారు.

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తు గడువు 24 వరకు పొడిగింపు

కాకినాడ రూరల్, సెప్టెంబరు 18: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు గడువును ఈ నెల 24వ తేదీ వరకు పొడిగించినట్టు కాకినాడ జిల్లా డీఈవో పి.రమేష్ తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తును ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో గత నెల 5వ తేదీ నుంచి అందుబాటులో ఉంచామన్నారు. ప్రింటెడ్ నామినల్ రోల్, ఒరిజినల్ ఎస్‌బీఐ కలెక్ట్ రసీదును డీఈవో కార్యాలయంలో ఈ నెల 27వ తేదీ లోపు సమర్పించాలని సూచించారు. ఇతర వివరాలకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్ చూడాలని లేదా డీఈవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.



హత్యకు గురైన గంటా రాజు

వ్యక్తి దారుణ హత్య

కోటనందూరు, సెప్టెంబరు 18: కాకినాడ జిల్లా కోటనందూరు మండలం భీమవరపుకోట శివారు తలుపులమ్మ తల్లి గుడి సమీపంలో బుధవారం ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. అతడిని అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని శివపురానికి చెందిన గంటా రాజు (35)గా పోలీసులు నిర్ధారించారు. పథకం ప్రకారం హత్య చేసినట్టు భావిస్తున్నారు. డ్రైవర్‌గా పనిచేస్తున్న గంటా రాజును ఈ ప్రాంతానికి తీసుకువచ్చి మెడపై కత్తితో వేటు వేసి అతి దారుణంగా చంపారు. వీఆర్వో సత్యనారాయణ ఫిర్యాదు మేరకు తుని రూరల్ సీఐ చెన్నకేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ పరిశీలించాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

లక్ష్మీగణపతి నవరాత్రి ఉత్సవాల ఆదాయం రూ.4.49 లక్షలు

బిక్కవోలు, సెప్టెంబరు 18: తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతికి నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను దేవదాయశాఖ తనిఖీ అధికారి (రామచంద్రపురం) ఆర్.బాలాజీరామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం తెరిచి లెక్కించారు. గత నెల 28 నుంచి ఈ నెల 18 వరకు రూ.4,49,350 ఆదాయం వచ్చిందని ఆలయ కమిటీ చైర్మన్ చాగంటి సాయిబాబారెడ్డి, ఈవో ఆకెళ్ల భాస్కర్ తెలిపారు. లెక్కింపులో ఆలయ కమిటీ సభ్యులు పల్లి శ్రీనివాసరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, కొమ్మోజు శ్రీనివాస్, ఆలయ సిబ్బంది ప్రసాద్, వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం



వివరాలు వెల్లడిస్తున్న చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా

100 కిలోల గంజాయి స్వాధీనం

చింతూరు, సెప్టెంబరు 18: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసులు 100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన స్వప్నిల్‌రాతీలాల్‌కోలి, ఆకాష్ విలాస్ చవాన్ ఒడిశాలోని కుర్మనూర్‌లో 100 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. చింతూరు మీదుగా మహారాష్ట్రకు కారులో తరలించే యత్నం చేశారు. చింతూరు పోలీసు స్టేషన్ ఎదుట వాహన తనిఖీల్లో గంజాయి పట్టుబడింది. నిందితులతో పాటు 100 కిలోల గంజాయి, కారు స్వాధీనం చేసుకున్నారు. విలేకరుల సమావేశంలో చింతూరు ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 18: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామ శివారున అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన సిద్దాంతి శ్రీను జగ్గంపేటలోని బంధువుల ఇంటికి మోటారు సైకిలుపై బయల్దేరాడు. మార్గమధ్యంలో రామవరం గ్రామ సమీపంలోకి వచ్చేసరికి బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని హైవే సిబ్బంది అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

వేంకటేశ్వరస్వామికి మూడు కిలోల వెండి కవచం బహూకరణ



అంతర్వేది, సెప్టెంబరు 18: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉపాలయమైన శ్రీవేంకటేశ్వరస్వామికి సఖినేటిపల్లిపాలేనికి చెందిన దంతులూరి కుమారవరప్రసాద్ వెంకటసత్యనారాయణరాజు, కుటుంబ సభ్యులు మూడు కిలోల 400 గ్రాముల రాళ్లతో రూ.3.50 లక్షలు విలువైన సంపూర్ణ వెండి కవచాన్ని బహూకరించారు. అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, సంప్రోక్షణ అనంతరం దానిని వేంకటేశ్వరస్వామికి అలంకరించగా భక్తులు దర్శించుకున్నారు. దాతలకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ సహాయ కమిషనరు సత్యనారాయణ అందించారు.

నన్నయ విశ్వవిద్యాలయంలో పీజీ రెండో సంవత్సరం (లేటరల్ ఎంట్రీ)

ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

దివాన్‌చెరువు, సెప్టెంబరు 18: ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం విశ్వవిద్యాలయ ప్రాంగణ కళాశాలలు, అనుబంధ కళాశాలల్లో వివిధ కోర్సుల కోసం రెండో సంవత్సరం పోస్ట్ గ్రాడ్యుయేట్ (లేటరల్ ఎంట్రీ)లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. నాలుగు సంవత్సరాల యూజీ ఆనర్స్ డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థి 3, 4 సెమిస్టర్లలో పరిశోధనతో లేదా 3వ సెమిస్టర్‌లో మాత్రమే కోర్స్ వర్క్, 4వ సెమిస్టర్‌లో ప్రాజెక్టు వర్క్‌తో రెండు సంవత్సరాల పీజీ ప్రోగ్రాంలో 2వ సంవత్సరం/3వ సెమిస్టర్‌లో లేటర్ ప్రవేశానికి అర్హులన్నారు. విశ్వవిద్యాలయంతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ పీజీ కళాశాలల్లో మంజూరైన 20 శాతం సూపర్ న్యూమరరీ సీట్ల విభాగాలు/కళాశాల వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో పొందుపరచామన్నారు. ఈ నెల 19నుంచి 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 25న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. నాలుగు సంవత్సరాల డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు సూచించిన నిబంధనలు పాటిస్తూ పీజీ లేటరల్ ఎంట్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశం పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ చూడాలని కోరారు.

దేవీ ఫిషరీస్‌లో రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్

నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని

జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 18: ఫుడ్ ఇండియా-2024 పేరిట కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ గురువారం వర్చువల్ విధానంలో దేశవ్యాప్తంగా పలు పరిశ్రమలను ప్రారంభించబోతున్నారు. ఇందులో భాగంగా కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం సీతానగరంలో దేవీ ఫిషరీస్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు చేసిన కొత్త రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రధాని మోదీ ప్రారంభిస్తారు. ఇది తమ కృషికి లభించిన గుర్తింపు అని కంపెనీ యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది.



ఎంపికలు నిర్వహిస్తున్న అధికారులు

రాష్ట్ర స్థాయి పోటీలకు

స్కూల్ గేమ్స్ ఎంపికలు

కాకినాడ అర్బన్, సెప్టెంబరు 18: వివిధ ఆటల పోటీల్లో రాష్ట్ర స్థాయిలో పాల్గొనడానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు పలు జట్ల ఎంపికలను బుధవారం కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాకినాడ డీఈవో రమేష్ ప్రారంభించారు. అండర్-17 విభాగంలో ఫుట్‌బాల్ పాటు అండర్-14, 17 విభాగాల్లో జూడో, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, సెపక్‌తక్రా ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 800 మంది క్రీడాకారులు పాల్గొన్నారని స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి లంక జార్జి తెలిపారు. కార్యక్రమంలో డీఎస్ఏ సీఈవో బి.శ్రీనివాసకుమార్, జేఎన్టీయూ క్రీడా కార్యదర్శి శ్యామ్‌కుమార్, కె.కుమార్, వి.రవిరాజు, కె.నూకరాజు పాల్గొన్నారు.



ఓ వీధిలో వెలుగుతున్న ఎల్ఈడీ దీపం

గొల్లప్రోలు వీధుల్లో విద్యుత్

వెలుగులు

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో 450 ఎల్ఈడీ దీపాల కొనుగోలు

గొల్లప్రోలు, సెప్టెంబరు 18: అంధకారంలో చిక్కుకున్న కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలో ఎట్టకేలకు బుధవారం వీధి దీపాలు వెలిగాయి. పట్టణంలోని వీధి దీపాలు మరమ్మతులకు గురికావడంతో ప్రధాన రహదారులతో పాటు వీధుల్లో లైట్లు కొంతకాలంగా వెలగట్లేదు. రాత్రివేళ ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్న సమాచారంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. తక్షణం కొత్తవి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 450 ఎల్ఈడీ లైట్లు కొనుగోలుకు కౌన్సిల్ ఆమోదం తీసుకున్నారు. జనసేన నాయకుడు కదారి తమ్మయ్యనాయుడు చొరవ తీసుకోవడంతో అతి తక్కువ ధరకు (గతంలో కంటే 50శాతానికి తక్కువగా) ఎల్ఈడీ వీధి దీపాలను అందించడంతో పాటు బిగించే ఏర్పాటు చేయడానికి బెస్ట్ ప్రొడక్ట్ నిర్వాహకులు ముందుకు వచ్చారు. మంగళవారం ఎల్ఈడీ వీధి దీపాలు నగర పంచాయతీ కార్యాలయానికి చేరగా బుధవారం ఏర్పాటు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ పనులను నగర పంచాయతీ కమిషనరు రవికుమార్ ప్రారంభించగా జనసేన నాయకులు పాల్గొన్నారు.



వీధి దీపాల ఏర్పాటును ప్రారంభిస్తున్న నగర పంచాయతీ కమిషనరు రవికుమార్

ఎండ తీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి

కొత్తపల్లి, సెప్టెంబరు 18: కొత్తపల్లి మండలం తీరప్రాంతాల్లో బుధవారం ఎండ తీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. విపరీతమైన వేడి, ఉక్కబోతతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. రోహిణీ కార్తెలో కూడా ఇంత వేడి, ఉక్కపోత చూడలేదని తీరప్రాంతాలకు చెందిన పెద్దలు చెబుతున్నారు. ప్రస్తుత ఎండ తీవ్రతకు కొత్తపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు వైరల్ జ్వరాలతో సతమతమవుతున్నారు.

పంటనష్టాలు నమోదు చేయకుంటే తెలియజేయాలి

మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, సెప్టెంబరు 18: ఏలేరు, సుద్దగడ్డ వరదల కారణంగా పంటలు నష్టపోయిన రైతులు తమ వివరాలు నమోదు చేయకపోతే తక్షణం అధికారులకు తెలియజేయాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సూచించారు. వరదలు, వర్షాలకు దెబ్బతిన్న, ముంపునకు గురైన గృహాలు వివరాలు, పశుసంపదకు జరిగిన నష్టం నమోదు చేయకున్నా కార్యాలయానికి వెళ్లి వివరాలు అందించాలన్నారు. వరదలు, వర్షాల కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరిని ఆదుకోవాలని కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు. ఏలేరు ఆధునీకరణ కోసం భూములు తీసుకుని పరిహారం ఇవ్వకున్నా వాటిని రికార్డుల్లో ప్రభుత్వ భూములుగా నమోదు చేశారని, ఇటువంటి భూములకు పరిహారం రాయలేదని తమ దృష్టికి వచ్చిందని వివరించారు. వైసీపీ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించకపోవడంతో రైతులు పంటలు సాగు చేసుకున్నారని తెలిపారు. ఇటువంటి వాటి వివరాలు నమోదు చేయాలని జిల్లా కలెక్టరు, ఇతర అధికారులను కోరామని వర్మ చెప్పారు.

'పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలి'

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 18: సీఎస్ఆర్ నిధులతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని, స్థానికులకు పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఎం క్లస్టర్ శాఖ మహాసభ డిమాండ్ చేసింది. బుధవారం వలసపాకల సుందరయ్య కాలనీలో సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం క్లస్టర్ శాఖ మహాసభ ఏ.కృష్ణాజీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు వి.సుబ్బరాజు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, కాకినాడ రూరల్ కన్వీనర్ టి.నాగేశ్వరరావు మాట్లాడుతూ మతోన్మాదానికి వ్యతిరేకంగా వివిధ రాజకీయ పార్టీలను ఐక్యం చేసిన ఘనత ఏచూరికి దక్కిందన్నారు. మూడేళ్ల కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టగా సభ్యులంతా చర్చించి అనంతరం ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో క్లస్టర్ శాఖ కార్యదర్శిగా తొట్టిపూడి రాజా, జిల్లా మహాసభ ప్రతినిధిగా టి.నాగేశ్వరరావును ఎన్నుకున్నారు.

'విద్యతో పాటు క్రీడల్లోను రాణించాలి'

గండేపల్లి, సెప్టెంబరు 18: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోను రాణించాలని మురారి ఉపసర్పంచ్ జాస్తి వసంత్ అన్నారు. మురారి హైస్కూల్‌లో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండల స్థాయి బాలురు సెలక్షన్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. మండలంలోని గండేపల్లి, మల్లేపల్లి, మురారి, తాళ్ళూరు, నాయకంపల్లి, సూరంపాలెం హైస్కూల్స్ నుంచి విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో పీఎంసీ మెంబర్ ఎస్.శ్రీనివాస్, హెచ్ఎ ఎన్.అమ్మాజీ, సర్పంచ్ కుక్కల ఆనంద్‌బాబు, మండల ఎస్‌జీఎఫ్ఐ కోఆర్డినేటర్ ఎస్.నవీన్‌కుమార్, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

'కులధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలి'

గండేపల్లి, సెప్టెంబరు 18: ఆదివాసీ గిరిజన కొండదొర ఎస్టీ కులధృవీకరణ శాశ్వత పత్రాలు మంజూరు చేయాలని గండేపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు మాట్లాడుతూ గండేపల్లి మండలం కె.గోపాలపురం గ్రామ ఆదివాసీ గిరిజన కొండదొరలకు ఎస్టీ ధృవీకరణ పత్రాలు కె.గోపాలపురం అనే గ్రామం పేరుతో ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలన్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కొండపర్తి నాగార్జున, పందిరి ప్రసాద్, కె.అర్జునుడు, జక్కంపూడి రాజా ఉన్నారు.

తాటిపర్తిలో ఉచిత పశువైద్య శిబిరం

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 18: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాష్ట్రీయ గోకుల్‌మిషన్, పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో పశువులు, ఆవులకు వైద్య, గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మినరల్ మిక్చర్ ప్యాకెట్లు, లివర్ టానిక్కులు, నట్టలు, నులి నివారణా మందులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్థకశాఖ జాయింట్ డైరెక్టరు సూర్యప్రకాశరరావు, గొల్లప్రోలు ఏరియా పశువైద్యశాల ఏడీ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ కల్యాణి, డాక్టర్ హిమజ, డాక్టర్ ప్రశాంత్ ఉన్నారు.

పిఠాపురంలో రేపు జాబ్‌మేళా

పిఠాపురం, సెప్టెంబరు 18: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పిఠాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 20న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు తెలిపారు. ఇన్నోవా సోర్స్(బ్యాంక్ ఆఫ్ బరోడా, కినారా కేపిటల్స్, ఎస్‌బీఐ కార్డ్స్), బీఎఫ్ఐఎల్, దక్కన్ ఫైన్ కెమికల్స్, ఎస్‌కే సేఫ్టీ వింగ్స్ ఫర్ అమెజాన్(కేఎల్ గ్రూపు) సంస్థల్లో 700 ఉద్యోగావకాశాలు ఉన్నాయని.. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ తదితర విద్యార్హతలు కలిగి ఉన్న వారికి రూ.10వేల నుంచి 22వేల వరకూ వేతనంతో ఉద్యోగాలు ఉంటాయన్నారు. ఇంటర్వ్యూకి బయోడేటా, ఆధార్‌కార్డు, ఐడీ అండ్ అడ్రస్ ప్రూఫ్, విద్యార్హతల సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని సూచించారు.వివరాలకు 8639951441, 9949156583లో సంప్రదించాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లరేవు, సెప్టెంబరు 18: తాళ్లరేవు మండలంలోని చొల్లంగిపేట, తాళ్లరేవు విద్యుత్ సబ్‌స్టేషన్లలో 33/11కెవి లైన్లు వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కాకినాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.ఉదయభాస్కర్ బుధవారం తెలిపారు. పి.మల్లవరం, జార్జీపేట, పోలేకుర్రు పంచాయతీ పరిధిలోని అన్ని హేబిటేషన్ గ్రామాలకు, కోరింగ, చొల్లంగి, చొల్లంగిపేట, పటవల, కొత్తూరు, జి.వేమవరం, రామన్నపాలెం, శాంతనమూల గ్రామాలకు ఉదయం 7.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన చెప్పారు.

మద్యం తాగి వాహనాలు నడిపినవారికి జైలు

కాకినాడ క్రైం, సెప్టెంబరు 18: మద్యం తాగి వాహనాలు నడిపిన 39మందికి కాకినాడ మూడో స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వి.నరసింహారావు బుధవారం జైలు, జరిమానా విధించారు. ఎస్పీ ఆదేశాలతో కాకినాడ ట్రాఫిక్-1, ట్రాఫిక్-2 సీఐలు ఎస్.రమేష్, డి.రామారావు వారి సిబ్బందితో కలిసి పలు ముఖ్య కూడళ్లలో మంగళవారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగిన 39మంది ద్విచక్ర వాహనదారులు పట్టుబడ్డారు. వారిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా 22మందికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా, అపరాధ రుసుం చెల్లించలేని 17మందికి ఒక్కొక్కరికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం

జేఎన్టీయూకే, సెప్టెంబరు 18: జేఎన్టీయూకే ఇండోర్ మైదానంలో రూ.35లక్షల వర్సిటీ నిధుల ద్వారా సింథటిక్ లేయర్‌తో ఆధునికీకరించిన బ్యాడ్మింటన్ కోర్టును ఇన్‌చార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమానికి వర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ అధ్యక్షత వహించగా వీసీ మట్లాడుతూ యూనివర్సిటీలో విద్యతోపాటు క్రీడలకు కూడా సమానమైన ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఇండోర్ మైదానంలో క్రీడాకారులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఎస్ఎంఎస్ డైరెక్టర్ ఎ.కృష్ణమోహన్, ఏఈఈ సన్నీఫ్రాన్సిస్, పీడీలు డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు,మహిదుర్గా ఉన్నారు.

భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

సామర్లకోట, సెప్టెంబరు 18: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో భాద్రపద పౌర్ణమి పర్వదినం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, వెంకన్న ముందుగా భీమేశ్వరస్వామికి విశేష అభిషేక పూజలు, పుష్పార్చన పూజలు.. బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో నిత్యాన్నదాన పథకంలో భాగంగా సుమారు 500మంది అన్నప్రసాదాలను స్వీకరించారు.

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 18: మండలంలోని ధర్మవరం నంది సెంటర్ వద్ద బుధవారం సాయంత్రం కూటమి నాయకుల ఆధ్వర్యంలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. స్వీట్లు పంపిణీ చేసి కేక్ కట్ చేసి అభిమానులకు అందజేశారు. ప్రధాని జన్మదినాన్ని పురస్కరించుకుని వచ్చే నెల అక్టోబరు2 వరకు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఊటా వీరబాబు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు,జనసేన నాయకుడు దాసం శేషారావు పాల్గొన్నారు.

భూమిని కబ్జా చేశారని మహిళ ఫిర్యాదు

ఏలేశ్వరం, సెప్టెంబరు 18: తన భర్తకు చెందిన భూమిని తన మరిది అయిన భేరీ అరవింద్ కుమార్ అనేవ్యక్తి నకిలీ దస్తావేజులతో కబ్జా చేశాడని పేరవరం గ్రామానికి చెందిన భేరీ రామతులసి పోలీసులు, రెవెన్యూ అధికారులకు బుధవారం ఫిర్యాదు చేశారు. స్థానిక తహశీల్దార్ వెంకటేశ్వరరావును వివరణ కోరగా రికార్డులు పరిశీలించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తావని తెలిపారు.

నవరాత్రి దీక్షలు విరమణ

పెద్దాపురం, సెప్టెంబరు 18: మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయంలో కాకినాడ భోగి గణపతి పీఠం ఆరాధకులు నవరాత్రి దీక్షలను బుధవారం విరమించారు. కాకినాడ భోగి గణపతి పీఠం నుంచి తొలితిరుపతికి పీఠం ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు దీక్షాధారులతో కలిసి వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

శిథిలావస్థలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

భయం భయంగా సిబ్బంది విధులు

పునఃనిర్మించాలని కోరుతున్న ప్రజలు



ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 18: ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. 6 మండలాల్లోని 66 గ్రామాలకు రిజిస్ట్రేషన్ సేవలు అందించే ఈ కార్యాలయ భవనం నిర్మించి 132 ఏళ్లు పూర్తయింది. బ్రిటీష్‌కాలంలో రాతి కట్టడాలతో నిర్మించిన ఈ భవనం పై కప్పు బాగా దెబ్బతినడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ప్రత్తిపాడులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనం 1892లో నిర్మించారు. ఇప్పటి వరకు సుదీర్ఘ సేవలందించిన ఈ భవనం శిథిలావస్థలో ఉంది. ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట నియోజకవర్గాలకు చెందిన 66 గ్రామాలకు ఈ కార్యాలయ రిజిస్ట్రేషన్ సేవలు అందిస్తున్నారు. ప్రత్తిపాడు మండలంలో 34, కిర్లంపూడిలో 8, ఏలేశ్వరంలో 11, గొల్లప్రోలులో 5, పిఠాపురంలో 2, శంఖవరం మండలాల్లోని 5 గ్రామాల ప్రజలుగా గత 132 ఏళ్లగా ఈ కార్యాలయం వద్ద ఇళ్ల, భూములు తదితర క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. నెలకు కనీసం 500 రిజిస్ట్రేషన్ల వరకు ఈ కార్యాలయంలో జరుగుతున్నాయి. అయితే కార్యాలయ పై కప్పు మరమ్మతులకు గురికావడంతో పెంకులు జారి పడుతున్నాయి. ఏ మాత్రం వర్షం పడినా నీరుకారి రికార్డులు తడిచిపోయే పరిస్థితి ఏర్పడింది. పై కప్పు టార్పలిన్ కప్పి సిబ్బంది క్షణం క్షణం భయం భయంగా విధులు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. రికార్డులను భద్రపరచడం కూడా కష్టసాధ్యమవుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్యాలయ భవనానికి నిధులు మంజూరు చేసి పునఃనిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే

కాకినాడ నుంచి అంతర్వేదికి టీడీపీ కార్యకర్తల పాదయాత్ర

కాకినాడ సిటీ, సెప్టెంబరు 18: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావాలని, ఎమ్మెల్యేగా కొండబాబు అత్యధిక మెజారిటీతో గెలుపొందాలని లక్ష్మీనరసింహ స్వామికి మొక్కుకున్న 10వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి మూగు రాజు, టీడీపీ కాకినాడ సిటీ అధికార ప్రతినిధి మూగు చిన్ని ఆధ్వర్యంలో కార్యకర్తలు బుధవారం దుమ్ములపేట దుర్గమ్మతల్లి గుడివద్ద నుంచి పాదయాత్రగా అంతర్వేది బయలుదేరివెళ్లారు. ఈ పాదయాత్రను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు జెండా ఊపి ప్రారంభించి కొంతదూరం నడిచారు. పాదయాత్ర బృందానికి పండితులు వేదమంత్రాలతో ఆశీర్వాదాలు అందించారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, మైనారిటీ నాయకుడు ఎంఏ తాజుద్దీన్, టీడీపీ నాయకులు తుమ్మల సునీత రమేష్, చోడిపిల్లి సతీష్, మోసా పేతూరు, ఎరిపిల్లి అబ్బాయి, నూకరాజు, లక్ష్మణరావు, పోలరాజు, యాకూబు ఉన్నారు.

పారదర్శకంగా నీటి సంఘాల ఓటర్ల జాబితాలు : ఆర్డీవో

గొల్లప్రోలు, సెప్టెంబరు 18: నీటి సంఘాల ఓటర్ల జాబితాలను పారదర్శకంగా రూపొందించాలని కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ ఆదేశించారు. గొల్లప్రోలు తహశీల్దారు కార్యాలయంలో వెబ్‌ల్యాండ్ ఆధారంగా ఓటర్ల జాబితా తయారీపై ఆయన బుధవారం పరిశీలన జరిపారు. వెబ్‌ల్యాండ్ 1లోని డేటాను కాపీ చేసుకుని 2లో ఉన్న డేటాతో సరిచూసుకోవాలన్నారు. భూమి మీద ఉన్న రైతుల వివరాలు మాత్రమే ఓటర్ల జాబితాలో ఉండాలని.. ఇందులో ఏమైనా తేడాలు ఉన్నా, ఫిర్యాదులు వచ్చినా సంబంధిత వీఆర్వో, సర్వేయర్లపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహశీల్దార్ సత్యనారాయణ తదితరులున్నారు.

సాక్షి పేపర్లు దహనం



కాకినాడ సిటీ, సెప్టెంబరు 18: ముంబై నటి జత్వానీ కేసులో తన పేరు బయటపడుతుందనే భయంతో జగన్‌రెడ్డి తన సొంత మీడియా సాక్షి పేపరులో మహిళలను కించపరుస్తూ రాతలు రాయిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ మేయర్ సుంకర పావని ధ్వజమెత్తారు. ఆమె ఆధ్వర్యంలో జగన్‌రెడ్డి తీరును నిరసిస్తూ టీడీపీ మహిళా కార్యకర్తలు బుధవారం కాకినాడలో సాక్షి పేపర్లను మంటల్లో వేసి దహనం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జత్వానీపై అక్రమ కేసులో తాడేపల్లి ప్యాలెస్‌లో స్క్రిప్ట్ రాసింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అధికారం పోయాకైనా సరే ఆడవాళ్లను అవమానించడం జగన్‌రెడ్డి మానుకోవాలని సుంకర పావని హెచ్చరించారు.

'చెకుముకి' పోస్టర్ల ఆవిష్కరణ

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 18: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచడమే లక్ష్యంగా చెకుముకి సైన్స్ సంబరాలు, టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్టు చెకుముకి కన్వీనర్ అనిశెట్టి సీతారామరాజు తెలిపారు. గొల్లప్రోలు మండలపరిషత్ కార్యాలయం వద్ద బుధవారం చెకుముకి సైన్స్ సంబరాలు 2024 పోస్టర్లను ఎంపీడీవో డీఎల్ఎస్ శర్మ, ఎంఈవో బి.శివప్రసాద్ ఆవిష్కరించారు. సెప్టెంబరు 25న పాఠశాల స్థాయిలో, అక్టోబరు 1న మండలస్థాయి, 27న జిల్లా స్థాయి, నవంబరు 9,10న రాష్ట్రస్థాయి సైన్స్ సంబరాలు జరుగుతాయని సీతారామరాజు వివరించారు. జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు ఏలేటి నానిబాబు, సమతా జిల్లా కన్వీనర్ చల్లా ఉమారాజ మంగతాయారు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సూరిబాబు తదితరులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు

పిఠాపురం, సెప్టెంబరు 18: పిఠాపురంలోని వాసవిక్లబ్ ఫౌండర్ ప్రెసిడెంట్ చక్కా మాణిక్య నాగభూషణం రెండో మనుమడు వెంకట రామచంద్ర శ్రీయన్ గుప్తా పుట్టిన రోజు సందర్భంగా పట్టణానికి చెందిన పారిశుధ్య కార్మికులందరికి బుధవారం దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు కొత్త దేవజగన్మోహనరావు, కార్యదర్శి కడించర్ల శంకర్, కోశాధికారి సుబ్బారాయుడు, కేవీ రామచంద్రమూర్తి, చక్కా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

లారీలు ఆపి వేసి నిరసన

శంఖవరం, సెప్టెంబరు 18: కత్తిపూడి అంబేడ్కర్ కాలనీలో పాఠశాల విద్యార్థులు శంఖవరం రహదారిలో లారీలు నిలిపి వేసి నిరసన వ్యక్తం చేశారు. లారీలు వేగంగా వెళ్లడం వల్ల దుమ్ములేచి ఇబ్బందులు పడుతున్నామని, క్వారీ మేటల్ తరలించే భారీ వాహనాలతో రహదారులు పాడవుతుండగా వాటిని క్వారీ బుడిదతో కప్పడంతో దూళి రేగుతుందని, దీంతో అవస్థలు పడుతున్నామన్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 18: గోకివాడ గ్రామంలో పేకాట ఆడుతున్న వారిపై రూరల్ ఎస్ఐ గుణశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.5,630 స్వాధీనం చేసుకున్నారు.

కొనసాగిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు



అన్నవరంలో పరిసరాలు శుభ్రం చేస్తున్న ఉద్యోగులు

అన్నవరం, సెప్టెంబరు 18: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బుధవారం సత్యగిరి జంక్షన్, విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంతాలలో సిబ్బంది పరిసరాలను శుభ్రపరిచారు. వ్యర్థాలను తొలగించడంతోపాటుగా నిర్మాణ మిగులు మెటీరియల్‌ను స్టోర్‌రూంకు తరలించారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు, ఏపీఆర్‌వో గణపతి,బలువు సత్యశ్రీనివాస్ తదితరులున్నారు.

జగ్గంపేట రూరల్: స్థానిక గోకవరం రోడ్డులో గల ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల వద్ద మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా తల్లి పేరుతో ఒక మొక్క కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతులు నెహ్రూ, డ్వామా పీడీ అడపా వెంకట లక్ష్మి, జడ్పీ సీఈవో పాఠంశెట్టి నారాయణమూర్తి, జిల్లా పంచాయతీ రాజ్ అధికారి సౌజన్యభారతి విచ్చేశారు. విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, విద్యార్థులున్నారు.

గొల్లప్రోలు రూరల్: గొల్లప్రోలు మండలం చెందుర్తి మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ జగ్గారపు శ్రీనివాస్, సహ ప్రధానోపాధ్యాయుడు చిరంజీవి, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు ఉన్నారు.

తుని రూరల్: తునిలో మున్సిపల్ కార్యాలయం నుంచి గొల్లఅప్పారావు సెంటర్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. గొల్లఅప్పారావు సెంటర్ వద్ద మానవహారంగా ఏర్పడి స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. కమిషనర్ ఎ.వెంకటరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ యినుగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి, డీఈ ప్రకాష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జీవీ శేఖర్ తదితరులున్నారు.



జగ్గంపేటలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

ఘనంగా వినాయక విగ్రహాల నిమజ్జనాలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 18: మండలంలో గణేష్ నిమజ్జనాలు బుధవారం ఘనంగా జరిగాయి. ప్రత్తిపాడులో పలు వీధుల్లో పూజలు అందుకుంటున్న గణనాథులను ట్రాక్టర్లు, వ్యాన్లపైన ఊరేగించి పోలవరం కాలువలో నిమజ్జనం చేశారు. ధర్మవరం, ఒమ్మంగి, శరభవరం, ఉత్తరకంచిలలో నిమజ్జనాలు నిర్వహించారు. అలాగే ప్రత్తిపాడులోని గోకవరంపు వీధి రామాలయం వద్ద భారీ అన్నదానాన్ని నిర్వహించారు.

కొత్తపల్లి: బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఉప్పాడ రేవులో గణనాథులను నిమజ్జనం చేశారు. అనంతరం భక్తులు సముద్రంలో స్నానాలు ఆచరించారు. కొత్తపల్లి పోలమ్మగుమ్మంసెంటర్లో గణేష్ వార్షికోత్సవం సందర్భంగా భారీ అన్నసమారాధన జరిగింది.

గండేపల్లి: ఉప్పలపాడులో శ్రీ లక్ష్మి గణపతి నిమజ్జనం జనసేన పార్టీ నాయకులు మేడిబోయిన శ్రీను, మేడిపోయిన బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సత్తి సోమరాజు, మేడిపోయిన శివరామకృష్ణ, బుజ్జి, గంగాధర్ పాల్గొన్నారు. మురారి, గండేపల్లి, మల్లేపల్లి గ్రామాల్లో వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా సాగాయి.

సామర్లకోట: సామర్లకోట, మండలంలోనూ గోదావరి కాలువ వెంబడి ఉన్న పుష్కరిణిల వద్ద గణేష్ నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. మున్సిపల్ లయన్స్ కమిటీ ప్రతినిధి అమలకంటి శ్రీనివాసరావుతో స్థానిక వరసిద్ధి వినాయకా తోపుడు బండ్ల పండ్ల వర్తకసంఘం ఉత్సవ పందిరి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీకుర్రోళ్ళు ఏర్పాటుచేసిన మహాన్నదానంలో సుమారు 8 వేల మంది భక్తులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో విగ్రహాలను తరలిస్తున్న దృశ్యం

కిర్లంపూడి: మండలంలో వినాయక నిమజ్జనాలు, మండపాల వద్ద అన్నదానాలు జరిగాయి.

లడ్డూ వేలం పాట

ఏలేశ్వరం, సెప్టెంబరు 18: పట్టణంలోని దిబ్బలపాలెం సాయినగర్‌లో వినాయక మండపం వద్ద 9 రోజుల పాటు పూజలు చేసి స్వామి వారి చెంత ఉంచి నివేదించిన 130 కిలోల 18 లడ్డూలను కమిటీ సభ్యులు వేలం పాట నిర్వహించారు. పైల శైలజ రూ.1,08,703కు స్వామి వారి మహాప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు. ఆకాశపు బుల్లియ్య, పోలారపు దుర్గా భవాని, చల్లా రాము, సతీష్ కుమార్, తదితరులు తీన్ మార్ డప్పులతో ఊరేగింపుగా ప్రసాదాన్ని శైలజ ఇంటికి అందజేశారు. ఏలేరు నదిలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. ప్రమాదాలకు తావు లేకుండా పోలీసు సిబ్బంది, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ రామలింగేశ్వరరావు తెలిపారు.

జీజీహెచ్ వైద్య బృందానికి అభినందనల వెల్లువ

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 18: ఆహ్లాద భరితంగా మెలకువగా ఉండగానే శస్త్ర చికిత్స నిర్వహిస్తూ మెదడులోని కణితిని తొలగించి రోగిని ప్రాణాపాయ స్థితి నుంచి సాధారణ స్థితికి తీసుకువచ్చిన కాకినాడ జీజీహెచ్ వైద్యబృందానికి అభినందనలు వెల్లువెత్తాయి. తొండంగి మండలం ఎ.కొత్తపల్లికి చెందిన అప్పన అనంతలక్ష్మికి తనకు ఇష్టమైన బ్రహ్మానందం కామెడీని టేబ్‌లో చూపించి తక్కువ మోతాదులో మత్తు ఇచ్చి శస్త్ర చికిత్స నిర్వహించి మెదడులోని కణితిని తొలగించిన న్యూరోసర్జరీ, అనస్తీషియా వైద్యబృందాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి అభినందించారు. ఈ మేరకు న్యూరోసర్జరీ సెమినార్ హాల్లో బుధవారం ప్రత్యేక అభినందన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ అనస్థీషియా హెచ్‌వోడీ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ హాజరై పీజీ విద్యార్థులను అభినందించారు. న్యూరోసర్జరీ హెచ్‌వోడీ విజయశేఖర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కోదండ గిరిరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ ఆదిత్య, అనస్థీషియా వైద్యనిపుణులు డాక్టర్ వింధ్య డాక్టర్ ఉమా మంజుల, డాక్టర్ కురుణ, డాక్టర్ చిరంజీవి, డాక్టర్ జరీన, సీనియర్ ప్రెసిడెంట్ డాక్టర్ సుధీర్, పీజీ వైద్య విద్యార్థులు ఉన్నారు.

సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే రాజప్ప అభినందన



చంద్రబాబును అభినందిస్తున్న రాజప్ప

సామర్లకోట, సెప్టెంబరు 18: రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలు కారణంగా బుడమేరు, ఏలేరు వరదల కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని, బాధిత ప్రజలను సత్వరం ఆదుకున్న ప్రభుత్వంగా చంద్రబాబును ఎల్లెడలా ప్రజలు అభినందిస్తున్నారని ప్రజల తరపున ముఖ్యంగా ఏలేరు వరద బాధితుల తరపున కృతజ్ఞతలను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప వ్యక్తం చేశారు. అమరావతి సచివాలయంలో బుధవారం రెండో ఈ-కెబినెట్ సమావేశం అనంతరం చంద్రబాబును రాజప్ప కలిసి అభినందించారు.

బెంగుళూరు ప్యాలెస్ ముఖద్వారంతో ఎగ్జిబిషన్

కాకినాడ సిటీ, సెప్టెంబరు 18: ఆనందభారతి ప్రాంగణంలో దుర్గా ట్రేడ్ ఫెయిర్ ఆధ్వర్యంలో మొదటిసారిగా బెంగుళూరు ప్యారిస్ సిటీ, ప్యాలెస్ ముఖద్వారంతో ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను బుధవారం టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు గ్రంధి బాబ్జి ప్రారంభించారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, జనసేన నగర అధ్యక్షుడు తోట సుధీర్, బీజేపీ నగర అధ్యక్షుడు గట్టి సత్యనారాయణ, బొబ్బిలి గోవిందు, గుజ్జు బాబు, గుత్తుల రమణ, జోగా రాజు, భద్రరావు పాల్గొన్నారు.

బోట్‌క్లబ్‌లో విద్యుత్ దీపాలు పునరుద్ధరణ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 18: బోట్‌క్లబ్ పార్కులో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో సందర్శకులు పడుతున్న ఇబ్బందులపై వాకర్స్ సంఘం అధ్యక్షులు అడబాల రత్నప్రసాదరావు ఎమ్మెల్యే పంతం నానాజీ దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు స్పందించి విద్యుత్తు లైట్లు పునరుద్ధరించడంపై సందర్శకులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నానాజీకి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అడబాల రత్నప్రసాదరావు తెలిపారు.

జనవాణిలో వినతులు స్వీకరించిన ఎంపీ, ఎమ్మెల్యే



మంగళగిరిలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్/కార్పొరేషన్, సెప్టెంబరు 18: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు బుధవారం మంగళగిరిలో జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పాల్గొన్నారు. వివిధ సమస్యలు పరిష్కారం కోరుతూ అర్జీలతో వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సత్వర పరిష్కారం చేయాలని సూచించారు. నెలలో ఒకరోజు పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉన్న జనసేన పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు జనవాణిలో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు నానాజీ తెలిపారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

పెద్దాపురం, సెప్టెంబరు 18: మన పెద్దాపురం ఫేస్‌బుక్ టీమ్ ఆధ్వర్యంలో ప్రతీ బుధవారం ప్రభుత్వాసుపత్రిలో మాతృత్వం పేరుతో గర్భిణులకు దాతల సహకారంతో పౌష్టికాహారాన్ని అందచేయడంపై ఎస్ఐ వి.మౌనిక టీమ్ సభ్యులను అభినందించారు. సుమారు 26 వారాల నుంచి ఈ కార్యక్రమం నిరాటంకంగా సాగడంపై సంతృప్తి వ్యక్తం చేసి మరిన్ని సేవాకార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఈవారం లూథరన్ హైస్కూల్ 2006-07 పదో తరగతి విద్యార్థులు 150 మందికి పౌష్టికాహారాన్ని అందచేశారు. ఖండవిల్లి సత్యనారాయణ, సత్యనారాయణ, లక్షణదివాకర్, హైదర్ ఆలీ, రామకృష్ణుడు, బాబీ నాయుడు, అన్వేష్, శివశంకర్, తరుణ్, శ్రీధర్, మన పెద్దాపురం గ్రూప్ సభ్యులు పెదిరెడ్డి నరేష్ పాల్గొన్నారు.

కూరగాయల దుకాణాలు దగ్ధం

కిర్లంపూడి, సెప్టెంబరు 18: మండలంలోని బూరుగుపూడి గ్రామంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కూరగాయల దుకాణాలు మంగళవారం అర్ధరాత్రి అగ్నికి ఆహుతయ్యాయి. మంటలు చెలరేగడంతో గ్రామస్తులు జగ్గంపేట ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా వారు మంటలు పూర్తి స్థాయిలో అదుపు చేశారు. వాకాడ సూరిబాబు, పట్టెం రాంబాబు దుకాణాల్లో ఉన్న కూరగాయల బస్తాలు కాలి బూడిదయ్యాయి. ఎర్రంశెట్టి భరత్ దుకాణం పాక్షికంగా కాలిపోయింది. దీంతో సుమారు రూ.3లక్షలు ఆస్తినష్టం జరిగింది. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. నెహ్రూ వెంట కుంచే తాతాజీ, కర్నాకుల పెదకాపు, మూరా సత్తిబాబు, పాటంశెట్టి తమ్మారావు ఉన్నారు.కిర్లంపూడి ఎస్ఐ సతీష్ పరిశీలించారు.

రక్తదాన శిబిరం

గండేపల్లి, సెప్టెంబరు 18: సూరంపాలెంలోని ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కాకినాడ రక్తదాన శిబిరం నిర్వహించారు. 180మంది విద్యార్థులు రక్తదానం చేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రమేష్ తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎం.రఘునాథ్, చిట్టూరి రాంప్రసాద్, డాక్టర్ పి.దుర్గరాజు పాల్గొన్నారు.

పశువులకు వ్యాక్సిన్లు

కోటనందూరు, సెప్టెంబరు 18: పశువులకు వ్యాధులు ప్రబలకుండా వేస్తున్న వ్యాక్సిన్‌లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు అన్నారు. కేపే మల్లవరంలో పశువుల వ్యాక్సిన్‌లను ప్రారంభించారు. ప్రతీరైతు వ్యాక్సిన్‌లను పశువులకు వేయించాలన్నారు.

'ఈకేవైసీ నమోదు తప్పనిసరి'

కోటనందూరు, సెప్టెంబరు 18: ఈ నెల 20లోగా రైతులు ఈ పంట, ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ తెలిపారు. బిళ్ళనందూరు, ఎస్సార్‌పేట, ఇండుగుబల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. రైతు సేవా కేంద్రాలకు వెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు.

తుమ్మలపల్లి రమేష్ పరామర్శ

గండేపల్లి, సెప్టెంబరు 18: మల్లేపల్లిలో జనసేన నాయకుడు పితాని వీరబాబు తండ్రి రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకోవడంతో జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు. మాదారపు వీరబాబు, మల్లేపల్లి గణేష్, గోకేడ ప్రసాద్, కె.మణికంఠ ఉన్నారు.

కర్ణాటక బ్యాంకులో నేత్ర పరీక్షలు



కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 18: దేవాలయం వీధిలోని కర్ణాటక బ్యాంకులో బ్యాంకు మేనేజర్ అరుణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బ్యాంకు సిబ్బందికి బ్యాంకు కస్టమర్లకు వాసన్ ఐకేర్ సౌజన్యంతో నేత్ర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్లద్దాలు, మందులు అందజేశారు. వాసన్ ఐకేర్ సిబ్బంది, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

తిమ్మాపురంలో భారీ అన్నదానం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 18: వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం తిమ్మాపురంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు మాదారపు తాతాజీ, శ్రీ సిద్ధి వినాయక ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన నిర్వహించారు. భక్తులకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు ఆహారం వడ్డించారు. చోడిశెట్టి ఇంద్ర, తూము బన్ను, పుల్ల శ్రీరాములు, ముద్దన ప్రకాశ్, కూరాకులు చిన బాబు, కోమర్తి కోటేశ్వరరావు,అధికంగా భక్తులు పాల్గొన్నారు.